సాక్షి మెదక్

మంగళవారం । 4 । జూలై । 2023



ఇళ్లు కట్టిస్తామంటూ టోకరా

పటాన్‌చెరులో ఇళ్లు కట్టిస్తామంటూ నమ్మించిన ఓ బిల్డర్ బాధితుల నుంచి సొమ్ము తీసుకొని ఉడాయించాడు. 8లో



అక్రమ నిర్మాణాల కూల్చివేతపై ఆగ్రహం

రామాయంపేటలో అక్రమంగా నిర్మించిన దుకాణాల కూల్చివేతపై సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యుల మధ్య గొడవ జరిగింది. 9లో

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్‌జోన్: ఉత్తమ జాతీయ అవార్డుల కోసం జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాధాకిషన్ తెలిపారు. ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి, సంబంధిత పత్రాలను రెండు జిరాక్స్ కాపీలు తీసి డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

న్యూస్‌రీల్

నిత్య జీవితంలో గణాంకాలు కీలకం

కలెక్టర్ రాజర్షి షా



గణాంకదర్శిని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: రోజువారి జీవితంలో గణాంకాలు కీలకమని కలెక్టర్ రాజర్షిషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా గణాంకదర్శిని 2021–22 పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక ప్రణాళిక రూపకల్పనలో గణాంకాలు ముఖ్యమని అన్నారు. జిల్లా గణాంక దర్శినిలో జనాభా, వాతావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, విద్య, రవాణా, నీటి వనరులు, పంటలు, కమ్యూనికేషన్, బ్యాంకింగ్, ఫైనాన్స్, లోకల్ బాడీ, ఇండస్ట్రీస్, సోషల్ సెక్యూరిటీకి సంబంధించిన అంశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేష్, ముఖ్య ప్రణాళిక అధికారి కృష్ణయ్య, జిల్లా వ్యవసాయ అధికారిణి ఆశాకుమారి, డీఈఓ రాధాకిషన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

99వ రోజుకు చేరిన దీక్షలు



దీక్షలో అఖిలపక్ష నాయకులు

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం రామాయంపేటలో నిర్వహిస్తున్న దీక్షలు సోమవారం 99వ రోజుకు చేరుకున్నాయి. డివిజన్ మంజూరయ్యే వరకు దీక్షలు విరమించబోమని అఖిలపక్షం ప్రతినిధులు స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దీక్షలకు వ్యాపార, కుల, యువజన సంఘాలు, పలు పార్టీల నాయకులు మద్దతు ప్రకటించారు.

ఇబ్బందులు రానీయొద్దు



మాట్లాడుతున్న అధికారులు

మెదక్ మున్సిపాలిటీ: జిల్లాలో కొనసాగుతున్న మైనార్టీ గురుకులాల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని డీఐఓ నయీమొద్దీన్ సూచించారు. ఉమ్మడి జిల్లాలో 25 పాఠశాలలకు సంబంధించిన వార్డెన్లతో సోమవారం పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో ఒక్కరోజు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ విద్యార్థులకు వసతి, భోజనం, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. వార్డెన్లు అందుబాటులో ఉండి విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎల్‌సీడీ నర్సింహులు, మైనార్టీ సంక్షేమ అధికారి జెమ్లా నాయక్, విజిలెన్స్ ఆఫీసర్స్ గౌసుద్దీన్, ప్రభువరన్, విక్రమ్ సింగ్, కాలేజ్ ప్రిన్సిపాల్ సురేఖ, జమీల్, హమీదుద్దీన్, సాబీర్, వార్డెన్లు పాల్గొన్నారు.

సర్పంచ్, కార్యదర్శికి షోకాజ్ నోటీస్

సాక్షి ఎఫెక్ట్

అల్లాదుర్గం(మెదక్): జిల్లా పంచాయతీ అధికారి సొంత గ్రామంలో పారిశుద్ధ్యంపై 'ఇదేనా.. పల్లె ప్రగతి' అనే శీర్షికన జూన్ 28న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. డీపీఓ సాయిబాబా విచారణకు ఆదేశించడంతో జూన్ 29న డీఎల్‌పీఓ రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ శంకర్ అల్లాదుర్గంలో వీధులను పరిశీలించారు. వర్షం కురిస్తే మోకాలు లోతు నీటిలో నడవాల్సిన దుస్థితిని తెలుసుకున్నారు. డీఎల్‌పీఓ నివేదిక ఆధారంగా అల్లాదుర్గం సర్పంచ్ అంజయ్య యాదవ్, పంచాయతీ కార్యదర్శి సవితకు కలెక్టర్ నుంచి షోకాజ్ నోటీస్‌లు జారీ అయ్యాయి.

చెరువు నీటి శాంపిల్స్ సేకరణ

చిన్నశంకరంపేట(మెదక్): చెరువులోకి వ్యర్థాలను వదులుతున్నారనే అంశంపై 'సాక్షి'లో వచ్చిన కథనానికి కాలుష్యనియంత్రణ మండలి అధికారులు (పీసీబీ) అధికారులు స్పందించారు. రామచంద్రపురం ప్రాంతీయ కాలుష్య నియంత్రమండలి ఏఈఈ రవీందర్ సిబ్బందితో కలిసి సోమవారం మండలంలోని చందంపేట–రుద్రారం పెద్ద చెరువును పరిశీలించి నీటి శాంపిల్స్ సేకరించారు. శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపిస్తామని, రిపోర్ట్‌కు ఆధారంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మళ్లీ ఫ్రీజింగ్

- వారం క్రితమే ఎత్తివేసిన ప్రభుత్వం
- తిరిగి విధించడంతో సర్పంచ్‌ల తిప్పలు
- నిధులు డ్రా చేయలేక ఇక్కట్లు
- బిల్లులు వస్తాయో లేదోనని ఆందోళన



ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి చిన్నశంకరంపేట మండలం బాగీర్తిపల్లి సర్పంచ్ దయానంద్. గతేడాది క్రితం పల్లె ప్రగతి, ప్రకృతివనం, మురికి కాలువల నిర్మాణానికి సొంతంగా రూ.25లక్షలు ఖర్చుచేశాడు. చేసిన పనులకు బిల్లులు అందలేదు. మరో ఆరు నెలల్లో సాధారణ ఎన్నికలు ఉండడంతో బిల్లులు వస్తాయో లేదోనని ఆందోళన చెందుతున్నాడు. ఇది ఒక దయానంద్‌దే కాదు.. జిల్లాలో దాదాపు సర్పంచ్‌ల అందరి పరిస్థితి.



బాగీర్తిపల్లి పల్లె ప్రకృతివనం

మెదక్ జోన్: పల్లెలను సంపూర్ణ పారిశుద్ధ్యంగా మార్చేందుకు ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించింది. గ్రామాలను శుభ్రంగా ఉంచడం, డ్రైనేజీ, రోడ్లు, ప్రకృతి వనాలు ఏర్పాటు తదితర పనులను పాలకవర్గాలకు అప్పగించింది. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హుకూం జారీ చేయడంతో పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజు పల్లెలను విజిట్ చేస్తున్నారు. సకాలంలో అభివృద్ధి పనులు చేయాలని జిల్లా అధికారులు సూచించడంతో సర్పంచ్‌లు అప్పులు చేసి గ్రామాభివృద్ధి పనులను చేపట్టారు. ఏడాదిగా చేసిన పనులకు బిల్లులు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

బిల్లుల ఆలస్యం..

- జిల్లాలో 469 పంచాయతీల్లో పాలకవర్గాల ఆధ్వర్యంలో పల్లె ప్రగతి పనులు కొనసాగుతున్నాయి.
- గ్రామాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, సీసీ రోడ్లతో పాటు ఇతర పనులను సర్పంచ్‌లు దగ్గరుండి చేయిస్తున్నారు.
- అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వాల నుంచి నిధులు విడుదల కాకపోవడంతో సొంతంగా అప్పు తెచ్చి పనులు నిర్వహించారు.
- ప్రభుత్వం ఎస్టీఓ అకౌంట్లను ఫ్రీజ్ చేయడంతో నిధులు డ్రా చేసే అవకాశం లేకుండా పోయింది.
- దీంతో కనీసం గ్రామాల్లో వీధిలైట్లు, పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.
- పనులు చేసి ఏడాది గడుస్తున్నా బిల్లులు రాకపోవడంతో అప్పులకు వడ్డీ పెరిగిపోతుందని ఆందోళన చెందుతున్నారు.
- ఐదుసార్లు పల్లె ప్రగతి నిర్వహిస్తే మొదటిసారి మాత్రమే నిధులు ఇచ్చారని, మిగతావి తమ జేబు నుంచి పెట్టుకున్నామని వాపోతున్నారు.
- ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు సొంత నిధులు ఖర్చు చేశామని, బిల్లులు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు.
- ఆరు నెలల్లో సాధారణ ఎన్నికలు జరుగనుండడంతో ఈలోగా గ్రామ అభివృద్ధికి ఖర్చు చేసిన బిల్లులు వస్తాయో లేదోనని టెన్షన్ పడుతున్నారు.
- ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారి, బిల్లులు రాకుంటే తమకు ఆత్మహత్యలే మార్గమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరగా అందించాలి



పల్లె ప్రగతిలో భాగంగా సొంత నిధులతో గ్రామంలోని మురికి గుంతలను పూడ్చడంతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేశాం. వాటికి సంబంధించి రూ.2లక్షలు రావాల్సి ఉంది. నిధులు లేక పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వలేని పరిస్థితి. ప్రభుత్వం స్పందించి త్వరగా నిధులు విడుదల చేయాలి.

– బందెల జ్యోతి, సర్పంచ్, జంగరాయి

త్వరలో మెడికల్ కళాశాల ప్రారంభం

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



వడ్డెర కాలనీ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

రామాయంపేట(మెదక్): మెదక్‌లో మెడికల్ కళాశాలను త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పద్మాదేవెందర్‌రెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో సొంత నిధులతో ఏర్పాటు చేయనున్న అంబేడ్కర్ కాంస్య విగ్రహ పనులు, కోమటిపల్లి తండా రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు సీఎం రూ.60 కోట్లు మంజూరు చేశారన్నారు. పింఛన్లు రానివారు ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోమటిపల్లిలో ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు, వడ్డెర కాలనీలో ఇళ్లు నిర్మించుకోవడానికి వీలుగా ఇళ్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. తండాలను పంచాయతీలుగా మారిన తర్వాతే గిరిజన ఆవాసాలు అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్, సహకార సంఘం చైర్మన్ బాదె చంద్రం, మున్సిపల్ కౌన్సిలర్లు నాగరాజు, దేమె యాదగిరి, సుందర్‌సింగ్, చిలుక గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు అమలు చేయాలి

మెదక్ మున్సిపాలిటీ: నియోజకవర్గంలోని దళిత జర్నలిస్టులకు దళితబంధు పథకం అమలు చేయాలని ఐడీజేఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ బి.నాగరాజు కోరారు. సోమవారం ఇంటర్నేషనల్ దళిత్ జర్నలిస్టు నెట్‌వర్క్(ఐడీజేఎస్) ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రయ్య, సిద్దిరాములు, సంజీవ్, జనార్దన్, మురళి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కర్తలకు ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో భాగంగా స్థానిక సమస్యల పరిష్కారం లక్ష్యంగా చేసిన సృజనాత్మక ఆవిష్కరణలను పంపించాలని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యావేత్తలు, రైతు లు, గృహిణులు, మెకానిక్‌లు తదితరులు తాము చేసిన ఆవిష్కరణపై ఆరు వాక్యాల వివరణ, రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణకు సంబంధించి నాలుగు ఫొటోలు, పేరు, వృత్తి, అడ్రస్ తదితర వివరాలతో ఆగస్టు 5వ తేదీలోగా 9100678543 నంబర్‌కు వాట్సాప్ చేయాలన్నారు. ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు జిల్లా సమన్వయకర్త రాజిరెడ్డి 8328599157 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలు

మెదక్ కలెక్టరేట్: 2023–2024 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో ప్రవేశాలకై ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ అభివృద్ధి జిల్లా అధికారి విజయలక్ష్మి తెలిపారు. 1వ తరగతిలో –59(నాన్ రెసిడెన్షియల్), 5వ తరగతిలో–61(రెసిడెన్షియల్) సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈనెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు మెదక్ కలెక్టరేట్‌లోని ఎస్సీ అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

కలెక్టర్ రాజర్షి షా

మెదక్ కలెక్టరేట్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి స్వీకరించారు. మొత్తం 41 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కారమవుతాయన ప్రజలు నమ్మకంతో ప్రజావాణికి వస్తారని, వారికి భరోసా కల్పించేలా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయాశాఖల జిల్లా అధికారులు, సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



కలెక్టరేట్ ముట్టడిలో సీఐటీయూ నాయకులు

మెదక్ కలెక్టరేట్: పేదలకు ఇండ్లు, ఇళ్ల స్థలాలతో పాటు గృహలక్ష్మి పథకం కింద రూ.15లక్షలు అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి నిర్వహించి, అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో అన్ని మండలాల్లో ఇల్లు లేక గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నవారిని గుర్తించి ఇంటి స్థలం, నిర్మాణం కోసం సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజ్, కోశాధికారి నర్సమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, ఆవాజ్ జిల్లా కన్వీనర్ మోహినొద్దీన్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి లచ్చ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యం 36 లక్షలు



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, రమేశ్

కలెక్టర్ రాజర్షి షా

మెదక్ కలెక్టరేట్: హరితహారంలో భాగంగా ఈ ఏడాది జిల్లాలో 36 లక్షల మొక్కలు నాటడం లక్ష్యంగా ముందుకెళ్తున్నామని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. సోమవారం సీఎస్ శాంతి కుమారి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పోడు పట్టాల పంపిణీ, గృహ లక్ష్మి, ఎరువులు, విత్తన నిల్వలు, సీఎంఆర్, హరితహారం, బీసీల ఆర్థిక సాయం, ఇళ్ల స్థలాల పంపిణీ తదితర అంశాలపై మాట్లాడారు. శాఖల వారీగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామని, ఇప్పటి వరకు 4.86 లక్షల మొక్కలు నాటామని పేర్కొన్నారు. ఫారెస్ట్ ఏరియాలో 2.36లక్షలు, డీఆర్డీఏ, గ్రామపంచాయతీలు, స్కూల్స్ వద్ద 29వేలు, అర్బన్ ప్రాంతాల్లో 62 వేల మొక్కలు నాటించామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రమేశ్, ప్రతిమాసింగ్, అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు తగిన న్యాయం అందించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రోహిణి ప్రియదర్శిని

మెదక్ మున్సిపాలిటీ: ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అధికారులకు సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజావాణిలో పలు సమస్యలపై బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పాత కక్షలతో తనను, తన కుటుంబసభ్యులను చంపడానికి ప్రయత్నిస్తున్నారని పెద్ద శంకరంపేట మండలం శివాయపల్లికి చెందిన దండు భూదమ్మ ఫిర్యాదు చేసింది. పలు మార్లు కర్రలతో దాడి చేశారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరింది. స్పందించిన ఎస్పీ విచారణ చేసి న్యాయం చేయాలని ఎస్ఐకి సూచించారు. తమ గ్రామానికి చెందిన కొందరు కొంతకాలంగా భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, రక్షణ కల్పించాలని మాసాయిపేట మండలం రామంతపూర్‌కు చెందిన సుగుణ ఫిర్యాదు చేయగా, తగిన న్యాయం చేయాలని చేగుంట ఎస్ఐకి సూచించారు.

సమయపాలన ఏది?

- ఆలస్యంగా వచ్చిన టీచర్..
- విద్యార్థుల నిరీక్షణ



రేగోడ్: రంజానాయక్ తండా పాఠశాలలో టీచర్ కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

రేగోడ్(మెదక్): విద్యార్థులను క్రమశిక్షణలో పెట్టాల్సిన ఉపాధ్యాయులే సమయపాలన పాటించడం లేదు. మొన్న పెద్దతండా పాఠశాలకు టీచర్ లేక తాళం పడితే.. తాజాగా రంజానాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో సోమవారం టీచర్ గంట ఆలస్యంగా రావడంతో విద్యార్థులు బయట నిరీక్షించారు. పాఠశాలలో 1 నుంచి 5 వరకు 19 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో టీచర్లు సమయపాలన పాటించడంలేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం నర్సింహారెడ్డిని వివరణ కోరగా.. పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీదేవి ఆలస్యంగా బడికి వచ్చారని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు మెరుగుపర్చాలి

కాంగ్రెస్ పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, ప్రజలు

నర్సాపూర్: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలను మెరుగు పర్చాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రి స్థాయిని 75 పడకలకు తగ్గించడాన్ని ఆయన ఖండించారు. ఆసుపత్రిలో సరిపడా వైద్యులు లేరని, వారు సకాలంలో రావడం లేదని, అవుట్ పేషెంట్‌విభాగం చాలా ఆలస్యంగా ప్రారంభిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ ధర్నాలో రిజ్వాన్, మల్లేష్, శ్రీనివాసగుప్తా, సురేష్, అశోక్, మల్లేష్, అశోక్‌గౌడ్, రషీద్, అజ్మత్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు, విడుదల

ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం స్వంత పూచీకత్తిపై వదిలిపెట్టారు.

అసంపూర్తి పనులతో అవస్థలు

- నిధులు లేక నిలిచిన లైబ్రరీ భవనం
- పట్టించుకోని అధికారులు



అద్దె గదిలో కొనసాగుతున్న ప్రస్తుత లైబ్రరీ



నర్సాపూర్ లైబ్రరీ భవనం

నర్సాపూర్: నిధుల సమస్యతో నర్సాపూర్‌లో నిర్మిస్తున్న లైబ్రరీ భవనం అసంపూర్తిగా మారింది. పనులు చేపట్టి మూడున్నరేళ్లు గడుస్తున్నా.. అధికారులు పట్టించుకోకపోవడంతో అడుగు ముందుకు పడడంలేదు. కొత్త భవనం పూర్తి కాకపోవడంతో అద్దె గదుల్లో తాత్కాలింగా లైబ్రరీని కొనసాగిస్తున్నారు. అక్కడ పూర్తిస్థాయి సౌకర్యాలు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు.

- నియోజకవర్గ కేంద్రం నర్సాపూర్‌లో పాత గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరడంతో నాలుగేళ్ల క్రితం దానిని కూల్చివేశారు.
- కొత్త భవనం నిర్మాణానికి రాజా రామ్మోహన్‌రాయ్ ఫౌండేషన్ నుంచి రూ.50లక్షలు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌నుంచి మరో రూ.40లక్షలు మంజూరయ్యాయి.
- రెండు అంతస్తుల భవనంలో పైన పుస్తకాలు, పేపర్లు భద్రపరిచేందుకు గదులు, పాఠకులు కూర్చునేందుకు వసతులు ఏర్పాటు చేయగా, కింద పార్కింగ్ కోసం కేటాయించారు.
- పై అంతస్థులో గోడలు పూర్తయినా.. ఫ్లోరింగ్, రంగులు, కరెంటు వైరింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.
- పనులు చేపట్టిన మేరకు బిల్లులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచాయి.
- కలెక్టర్ రాజర్షి షా ఫిబ్రవరిలో లైబ్రరీని సందర్శించి, త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించినా.. పనులు ముందుకు సాగడంలేదు.
- భవనం పూర్తి చేయాలంటే మరో రూ.25లక్షల అవసరమని అధికారులు చెబుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



నర్సాపూర్‌లో లైబ్రరీ భవనం పూర్తి చేసేందుకు మరిన్ని నిధులు అవసరం ఉన్నాయి. దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం.

– రాధిక లక్ష్మి, డీఈఈ, పంచాయతీ రాజ్ శాఖ

క్లుప్తంగా

డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 19 మందిని ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. వీరిని సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 19 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృత్యువాత

చేర్యాల(సిద్దిపేట): విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతిచెందిన సంఘటన మండలపరిధిలోని ఆకునూరులో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జక్కు మల్లేశం ఆదివారం రాత్రి పొలం పనులు ముగించుకుని పాడి గేదెను బావి వద్ద కట్టేసొచ్చాడు. సోమవారం ఉదయం వెళ్లిచూడగా విద్యుత్‌వైర్లు కింద పడి ఉన్నాయి, షాక్ తగిలి పాడిగేదె మృతి చెంది ఉందన్నాడు. ఈ ఘటనలో సుమారు రూ.80వేల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

మేకపోతు కూడా..

శివ్వంపేట(నర్సాపూర్): కరెంట్ షాక్‌తో మేకపోతు మృతిచెందిన సంఘటన రూప్లతండా పంచాయతీ పరిధిలోని పోతిరెడ్డిపల్లి తండాలో సోమవారం చోటుచేసుకుంది. వ్యవసాయ పొలాల వద్ద ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్‌లు కింద పడి ఉండటంతో షాక్ తగిలి బనావత్ భిక్షపతికి చెందిన మేకపోతు మృతిచెందింది. దీని విలువ సుమారు రూ.22వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఇక్కడ తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయని రైతులు వాపోయారు. గతంలోనూ పలు గేదెలు మృతిచెందాయన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి వేరేచోటికి మార్చాలని అధికారులకు చెప్పిన పట్టించుకోవడంలేదన్నారు.

దొంగ అరెస్ట్

తూప్రాన్: మండలంలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ బోరు బావుల వద్ద కేబుల్ వైర్లు, స్టార్టర్లు చోరీ చేస్తున్న దొంగను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని వట్టూరు, పడాల్‌పల్లి, నాగులపల్లి, జెండాపల్లి గ్రామాల్లో వ్యవసాయ బోరుబావుల వద్ద రాత్రి వేళల్లో కేబుల్ వైర్లు, స్టార్టర్లు దొంగతనం చేస్తున్న శివ్వంపేట మండలం పెద్ద గొట్టిముక్ల గ్రామానికి చెందిన బాణాపురం ఆంజనేయులు(38) అనే వ్యక్తి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుడిని విచారించగా దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. దీంతో అతడిని పోలీసులు అరెస్టు చేశారు. దొంగలించబడిన కేబుల్ వైర్లు, స్టార్టర్లు కొన్నింటిని రికవరీ చేశారు. నిందితుడిపై కేసు దర్యాప్తు చేపట్టామన్నారు.

భవనం పై నుంచి పడి విద్యార్థికి తీవ్రగాయాలు

పటాన్‌చెరు టౌన్: రెండో అంతస్తు పైనుంచి కింద పడి ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన పటాన్‌చెరు మండలం పాటీ నారాయణ కళాశాల క్యాంపస్‌లో చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆంధ్ర రాష్ట్రం ఒంగోలుకు చెందిన ఓ విద్యార్థిని తల్లిదండ్రులు ఇటీవల ఇంటర్ మొదటి సంవత్సరంలో చేర్పించారు. అయితే సోమవారం విద్యార్థి భవనం రెండో అంతస్తు పై నుంచి పడటంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం రామచంద్రాపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థి ప్రమాదవశాత్తు పడ్డాడా? మరేదైన కారణం ఉందా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై భానూర్-బీడీఎల్ పోలీసులను సంప్రదించగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

ఇళ్లు కట్టిస్తానంటూ బిల్డర్ టోకరా



బాధితులు

- కుటుంబంతో సహా పరారీ
- తమకు న్యాయం చేయాలంటూ పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు

దుబ్బాకటౌన్: ఇళ్లు కట్టిస్తామంటూ లబ్ధిదారులను నమ్మించి చేతికి అందినంత సొమ్ము తీసుకొని కుటుంబంతో సహా ఉడాయించాడు ఓ బిల్డర్. సోమవారం బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో ఈ ఉదంతం పట్టణంలో వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్ర రాష్ట్రం ఒంగోలు జిల్లా పామూరు మండలం బొట్ల గూడూరు గ్రామానికి చెందిన బిల్డర్ పిక్కిలి ప్రసాద్ పదేళ్లగా దుబ్బాకలో నివసిస్తున్నాడు. ప్రైవేటు బిల్డింగ్‌లు కట్టిస్తుంటాడు. నూతనంగా ఇళ్లు కట్టుకునే వారితో గంపగుత్త(కాంట్రాక్టు)గా మాట్లాడుకుని గృహాలు నిర్మిస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం పట్టణానికి చెందిన సుమారు 25 మంది లబ్ధిదారులకు ఇళ్లు కట్టిస్తానని నమ్మించి రూ. 2 కోట్లకుపైగా నగదు వసూలు చేశాడు. తీరా బిల్డర్ ప్రసాద్ ఆదివారం రాత్రికిరాత్రే కుటుంబంతో సహా పరారయ్యాడు. సోమవారం ఉదయం బిల్డర్ ఉంటున్న అద్దె ఇంటికి బాధితులు వెళ్లారు. అక్కడ ఇంట్లో సామగ్రి సహా అందరూ పరారయ్యారు. అతడికి ఫోన్ చేయగా స్విచ్చాఫ్ అని వస్తుంది. దీంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇన్‌స్పెక్టర్ మహేందర్ వివరణ కోరగా పట్టణానికి చెందిన పుట్ట నాగరాజ్‌తో పాటు మరికొందరు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రూ. 17 లక్షలిస్తే శ్లాబ్ వేసి వదిలేశాడు



నా పేరు కంపె మౌనిక. నాది దుబ్బాక మండలం రఘోత్తంపల్లి. నేను బిల్డర్ ప్రసాద్‌కు గృహ నిర్మాణం కోసం రూ.17 లక్షలు ఇచ్చాను. బిల్డింగ్ శ్లాబ్ మాత్రమే పూర్తయింది. ఇంకా రూ.13 లక్షల పని మిగిలి ఉంది.

– కంపె మౌనిక, రఘోత్తంపల్లి

బిల్డర్‌ను పట్టుకుని న్యాయం చేయండి



నా పేరు రాయిని తిరుమలేశ్. నేను దుబ్బాకలో బిల్డింగ్ కట్టమని బిల్డర్ ప్రసాద్‌తో కాంట్రాక్టు మాట్లాడుకున్నాను. అతడు నన్ను రూ.6 లక్షల పైనే మోసం చేశాడు. పోలీసులు అతడిని పట్టుకుని న్యాయం చేయాలి.

–రాయిని తిరుమలేశ్, దుబ్బాక

అల్లాదుర్గం-వట్‌పల్లి రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్

వట్‌పల్లి(అందోల్): అల్లాదుర్గం నుంచి వట్‌పల్లి మీదుగా మెటల్‌కుంటా వెళ్లే రోడ్డు రెండేళ్లగా మరమ్మతులకు నోచడం లేదని, ఈ గుంతల్లో ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారిందని సోమవారం సాక్షి దినపత్రికలో 'పట్టించుకునేవారే లేరా' పేరిట కథనం ప్రచురించింది. అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ చొరవతో స్పందించిన బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై ఏర్పడిన గుంతలలో కంకర వేసి పూడ్చారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రోడ్డు మరమ్మతు పనులు చేపడుతున్నట్లు పీఏసీఎస్ డైరెక్టర్ బుద్ధిరెడ్డి తెలిపారు. ప్రస్తుతం మరమ్మతుల విషయమై ఆర్అండ్‌బీ ఏఈ మనోజ్ వివరణ కోరగా, వాటికి సంబంధించి ప్రత్యేకంగా ఎటువంటి నిధులూ మంజూరు కాలేదన్నారు. సోమవారం గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత వారం రోజుల్లో ఈ రోడ్డుపై మూడు వాహనాలు ఇరుక్కపోవడం, ఓ వాహనం బోల్తా పడటం వంటి వరుస ఘటనలు చోటుచేసుకున్న విషయం తెలిసిందే.

విద్యార్థిపై దాడి

నర్సాపూర్: ఓ విద్యార్థిని తోటి విద్యార్థులు కొట్టారు. ఈ ఉదంతం సోమవారం మండలంలోని తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలలో వెలుగుచూసింది. ప్రిన్సిపాల్ కథనం ప్రకారం.. తునికి ఎంజేపీ గురుకుల పాఠశాలలో కొడిపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి పదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం విద్యార్థులు గొడవ పడ్డారు. దీంతో రాత్రి అసభ్య పదజాలంతో తిట్టాడని, అదే తరగతికి చెందిన పలువురు విద్యార్థులు దాడి చేసి కొట్టారు. ఆ సమయంలో బాధితుడు ఉపాధ్యాయులకు గానీ, స్నేహితులకు గానీ చెప్పలేదు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులకు ఫోన్‌చేసి చెప్పడంతో అక్కడికి తల్లిదండ్రులు చేరుకొని ఉపాధ్యాయులను నిలదీశారు. దీంతో ప్రిన్సిపాల్ శివప్రసాద్ దాడికి పాల్పడిన విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా తమను ఇష్టానుసారంగా అసభ్యపదజాలంతో దూషించడంతో కొట్టినట్లు విద్యార్థులు చెప్పారు. మరోసారి ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినచర్యలు తప్పవని, ఏదైనా సమస్య ఉంటే ఉపాధ్యాయులకు చెప్పాలని ప్రిన్సిపాల్ సూచించారు.

తాగి వాహనాలు నడపొద్దు

టూటౌన్ సీఐ రవికుమార్



ఆటోడ్రైవర్లకు అవగహన కల్పిస్తున్న సీఐలు రవికుమార్, రామకృష్ణ

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడపకూడదని, ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి నడపాలని టూటౌన్ సీఐ ఆటో డ్రైవర్లకు సూచించారు. ట్రాఫిక్ అవేర్‌నెస్‌లో భాగంగా టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లకు సోమవారం అవగహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ రవికుమార్ మాట్లాడుతూ, రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ ఆటోలు నిలుపరాదని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం



రాథోడ్

ఝరాసంగం(జహీరాబాద్): వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యమయ్యారు. ఈ ఘటనలు మండలంలో చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని చీలపల్లి తాండ గ్రామానికి చెందిన రాథోడ్ సంతోష్ (30) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తుంటాడు. గత నెల 29న రాత్రి 8 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి కారు తీసుకుని వెళ్లిపోయాడు. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాలేదు. సంతోష్ ఆచూకీ కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోయింది. సోమవారం అతడి భార్య బానోత్ మమత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

జహీరాబాద్‌లో..



అహ్మద్

పట్టణానికి చెందిన అహ్మద్(36) మార్బుల్ గ్రానైట్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈనెల 1న ఝరాసంగం మండల పరిధిలోని జునేగావ్ గ్రామానికి పని కోసం వెళ్లాడు. పనులు ముగించుకొని రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి వస్తున్నానని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మరికొంత కాసేపటికే రావటం లేదని మరుసటిరోజు ఉదయం వస్తానని చెప్పాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో సోమవారం కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయగా ఎస్ఐ రాజేందర్ రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడికి రిమాండ్

గజ్వేల్‌రూరల్: జేఎల్ఎం(జూనియర్ లైన్ మెన్)నరేశ్ పై పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడిన కరుణాకర్ రిమాండ్‌కు తరలించినట్లు గజ్వేల్ ఎస్ఐ నరేష్ సోమవారం పేర్కొన్నారు. క్యాసారంలోని 2వ వార్డు వాసి కరుణాకర్ ఇంటికి వచ్చిన కరెంటు బిల్లు చెల్లించకపోవడంతో జేఎల్ఎం రెండ్రోజుల క్రితం విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. దీంతో అసహనానికి గురైన వినియోగదారుడు కరుణాకర్ అదే రోజు బైక్‌లోని పెట్రోల్ తీసి జేఎల్ఎం నరేశ్‌పై పోయడంతో కరుణాకర్ కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. తనపై హత్యాయత్నం జరిగిందని నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కారు డ్రైవర్ అతివేగానికి ఇద్దరు బలి

- బైకును ఢీకొట్టిన కారు
- హత్నూర మండలంలో ఘటన
- మృతులిద్దరూ నవాబుపేట వాసులు



ప్రమాద స్థలంలో పడి ఉన్న బైక్, కారు



శ్రీశైలం (ఫైల్)



రాములు (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): కారు డ్రైవర్ వాహనంతో అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన మండలంలోని మల్కాపూర్ శివారులో ఉన్న ఎమ్మెన్నార్ పరిశ్రమ సమీపంలో సంగారెడ్డి నర్సాపూర్ ప్రధాన రహదారిపై సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన అవుసలి శ్రీశైలం(40) ఎరుకలి రాములు(45) కలిసి బైక్‌పై మండలంలోని బోర్పట్ల శివారులో గల మిషన్ భగీరథ పంప్ హౌస్ వద్దకు పనుల నిమిత్తం రోజువారి మాదిరిగానే వెళుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెన్నార్ పరిశ్రమ సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి మాధుర దత్తాచల క్షేత్రానికి దర్శనం నిమిత్తం ప్రయాణికులను తీసుకెళ్తున్న కారు డ్రైవర్ వాహనాన్ని అతివేగంగా నడిపి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీశైలం, రాములు అక్కడికక్కడే మృతిచెందారు. కార్ బెలూన్లు తెర్చుకోవడంతో కారులోని వారికి ప్రమాదం తప్పింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. మృతుడు శ్రీశైలంకు భార్య రేణుక, కొడుకు, కూతురు, రాములకు భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

మృతులిద్దరు నవాబుపేట వాసులు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఇద్దరు నవాబుపేట వాసులు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రోజువారీ కూలి పని చేసుకుని జీవించేవారు. వారి మృతితో ఆ రెండు కుటుంబాలు వీధిపాలు పడ్డాయి. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు.

కొండపాకకు వెళుతుండగా..

- తండ్రి పరిస్థితి విషమం
- కుమారుడికి స్వల్పగాయాలు



గాయపడిన శ్రీనివాస్



హర్షవర్ధన్

కొండపాక(గజ్వేల్): బైక్‌ను ఆటో ఢీకొనగా తండ్రీకొడుకులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని రవీంద్రనగర్ గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. తెలిసిన వివరాల ప్రకారం.. చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామానికి చెందిన తాళ్లపల్లి హర్షవర్ధన్ కొండపాకలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉండి చదువుకుంటున్నాడు. ఆదివారం హర్షవర్ధన్ ఇంటికి వెళ్లాడు. సోమవారం హర్షవర్ధన్ అతడి తండి శ్రీనివాస్ బైక్‌పై తిరుగు పయనమవుతుండగా రవీంద్రనగర్ శివారులో ఆటో, బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాస్ తలకు బలమైన గాయమైంది, హర్షవర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది మహేందర్, రమేష్ సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారని 108 సిబ్బంది పేర్కొన్నారు.

కారు బోల్తా.. మహిళ దుర్మరణం
బాధితులంతా ఆంధ్ర రాష్ట్రం గుంటూరు జిల్లావాసులు

మునిపల్లి(అందోల్): కారు బోల్తా పడిన ఘటనలో మహిళ మృతిచెందింది. ఈ ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. ఈ సంఘటన లింగంపల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. బుదేర ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. ఆంధ్ర రాష్ట్రం గుంటూరు జిల్లాకు చెందిన సాయివరుణ్ తన తల్లి కల్పన(46) మామ గణేష్, అత్త సుజాతలతో కలిసి ఈ నెల 1న జహీరాబాద్ మీదుగా కర్ణాటక రాష్ట్రంలో ఉన్న ఘాణగాపూర్ పుణ్యక్షేత్రానికి దైవ దర్శనం కోసం కారులో వెళ్లారు. ఆరోజు రాత్రికి అక్కడే ఉండి మరుసటి రోజు ఉదయం తిరుగు పయనమయ్యారు. ఆ సమయంలో సాయివరుణ్ మేనమామ గణేష్ కారు నడుపుతున్నాడు. జహీరాబాద్ నుంచి హైదరాబాద్ వైపునకు వస్తున్న క్రమంలో మునిపల్లి మండలం లింగంపల్లి గ్రామ శివారులో కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కల్పన, సుజాతలకు తీవ్రగాయాలు కాగా, సాయివరుణ్, గణేష్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. అందరినీ జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కల్పనను సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది. సుజాత, సాయివరుణ్, గణేశ్ హైదరాబాద్‌లోని మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సాయివరుణ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కబళించిన చేపల వల

కాళ్లు చిక్కుకొని నీటమునిగి వ్యక్తి మృతి



యాదగిరి (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): చేపల వేటకు వెళ్లిన వ్యక్తి వలకు చిక్కుకుని నీటమునిగి ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన చిన్నశంకరంపేటలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు...మండలకేంద్రానికి చెందిన ఎడ్ల యాదగిరి(55) ఆదివారం రాత్రి స్థానిక చెరువు వాగు కాలువలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వల కాళ్లకు చిక్కుకుని నీటిలో మునిగి మృతిచెందాడు. రైస్‌మిల్‌లో పనిచేసే యాదగిరి ఆదివారం పనిముగించుకుని ఇంటికొచ్చి చేపలవేటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం వాగులో చిన్నశంకరంపేట ప్రధాన రహదారిపై ఉన్న బ్రిడ్జి సమీపంలో వాగు నీటిలో విగతజీవిగా కన్పించాడు. ఈ ఘటనపై పోలీసులకు కుటుంబసభ్యులు సమాచారం అందించారు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుభాష్‌గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్‌షాక్‌తో కాంక్రీట్ కార్మికుడు..



గోపి మృతదేహం

చిన్నశంకరంపేట(మెదక్): విద్యుత్ షాక్‌తో కాంక్రీట్ కార్మికుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని మిర్జాపల్లి రోడ్డు పనుల వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. మండల కేంద్రంలోని రాధా స్టీల్ సమీపంలో బ్రిడ్జి పనులు నిర్వహిస్తున్న ఆంధ్ర.. ప్రకాశం జిల్లా వెంగాయపాలెం గ్రామానికి చెందిన ఇర్ల గోపి(23) కాంక్రీట్ మిషన్ నుంచి అన్‌లోడ్ చేస్తున్నాడు. మిషన్‌కు విద్యుత్‌వైర్లు తగిలిన విషయం గమనించకపోవడంతో షాక్‌కు గురై మృతిచెందాడు. సమీపంలోని నార్సింగి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ తెలిపారు. మృతుడి భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. శవపంచనామా నిర్వహించి, మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు చోట్ల నలుగురి ఆత్మహత్య

వేర్వేరు చోట్ల పలు కారణాలతో నలుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనలు రాయపోలు, చేగుంట, కొండపాక, తూప్రాన్‌లలో చోటు చేసుకున్నాయి. కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం...

పెళ్లిపై బెంగతో యువకుడు



సంజీవ్ (ఫైల్)

రాయపోలు(దుబ్బాక): పెళ్లిపై బెంగతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్‌లో చోటుచేసుకుంది. దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్యకుమార్ కథనం ప్రకారం.. తిర్మలాపూర్ గ్రామానికి చెందిన జంగమొల్ల సంజీవ్ (28) వ్యాపారం చేసుకునేవాడు. కొంతకాలంగా అతడికి పెళ్లి సంబంధాలు చూస్తుండగా ఏదీ కుదరడం లేదు. దీంతో కొన్ని రోజులుగా మనస్తాపంతో ఉంటున్న అతడు ఆదివారం పురుగుల మందు తాగాడు. తీవ్రమైన కడుపునొప్పిని భరించలేక కరెంటు తీగతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలయ్యాయి. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని రైలు కింద పడి..



బాబు(ఫైల్)

చేగుంట(తూప్రాన్): రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాసాయిపేటలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన పోతినపల్లి బాబు(24) ఖాళీగా ఉండేవాడు. ఏదైనా పని చేసుకొని డబ్బులు సంపాదించుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన అతడు హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపునకు వెళ్తున్న ఓ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే ఎస్ఐ తావూ నాయక్ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహం పోస్టు మార్టం నిమిత్తం కామారెడ్డి రైల్వే ఆస్పత్రికి తరలించినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

అప్పుల బాధతో యువరైతు..



మహేందర్ (ఫైల్)

కొండపాక(గజ్వేల్): అప్పుల బాధతో పురుగుల మందు తాగి యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లిలో ఆలస్యంగా సోమ వారం వెలుగు చూసింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకిరెడ్డిపల్లికి చెందిన రైతు కరడపల్లి మహేందర్(32)కు ఎకరా పొలం ఉంది. బోరుబావి ఆధారంగా వ్యవసాయం చేస్తుండేవాడు. వ్యవసాయం కోసం, నూతనంగా ఇంటి నిర్మాణం కోసం సుమారు రూ.10 లక్షలు అప్పులు చేశాడు. అప్పులు తీర్చే విషయంలో పలుమార్లు కుటుంబీకులతో చెప్పుకొని మదనపడుతుండేవాడు. తరుచుగా కడుపునొప్పి వస్తుండటంతో ఎన్ని మందులు వాడినా తగ్గడం లేదు. అప్పులు తీర్చే మార్గం కానరాక మనస్తాపం చెందిన అతడు జూన్ 29న వ్యవసాయ బావి వద్ద పురుగుల మందు తాగి అపస్మరక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే సిద్దిపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈ మేరకు మృతుడి భార్య ప్రత్యూష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు త్రీటౌన్ సీఐ. భానుప్రకాశ్ తెలిపారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..

తూప్రాన్: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ఇస్లాంపూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ సురేశ్‌కుమార్ కథనం ప్రకారం.. శివ్వంపేట మండలం గుండ్లపల్లికి చెందిన విభూతి సురేశ్(25)కు ఇస్లాంపూర్‌కు చెందిన ఎల్లమ్మతో వివాహమైంది. అప్పటి నుంచి ఇస్లాంపూర్ లోనే నివాసం ఉంటున్నాడు. కూలీ పని చేసుకుంటూ భార్యాభర్తలు జీవిస్తున్నారు. మద్యానికి బానిసైన సురేశ్ నిత్యం ఇంట్లో గొడవ పడేవాడు. ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకెళ్లిన సురేశ్ తిరిగి ఎంతకీ ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న చంద్రయ్య

తూప్రాన్: కుటుంబ కలహాలతో వృద్ధుడు గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన పట్టణకేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చేగుంట మండలం చందాయిపేటకు చెందిన చంద్రయ్య(68) కుటుంబసభ్యులతో కలిసి కొన్నేళ్లుగా తూప్రాన్‌లో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబలో కలహాలు మొదలయ్యాయి. మనస్తాపం చెందిన చంద్రయ్య గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో గాంధీ ఆస్పత్రికి కుటుంబ సభ్యులు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు.

నా ఎదుగుదలకు సిద్దిపేట తోడ్పాటు

సినీహీరో సంపూర్ణేష్ బాబు



లోగోను ఆవిష్కరిస్తున్న సంపూర్ణేష్ బాబు

సిద్దిపేటజోన్: నేను నటుడిగా ఎదగడానికి సిద్దిపేట తోడ్పాటు ఎంతో ఉందని, ఇక్కడి ప్రాంత ప్రజలు సంపూర్ణ సహకారం అందించారని బర్నింగ్ స్టార్, సినీ హీరో సంపూర్ణేష్ బాబు అన్నారు. సోమవారం స్థానిక విపంచి ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర డ్యాన్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ, అసోసియేషన్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్స్ మాట్లాడుతూ సిద్దిపేట కవులు, కళాకారులకు కోటలాంటిదని అన్నారు. అంతకుముందు బలగం చిత్రం ఫేమ్ ఐలయ్య పాత్రధారి కోట జయరాం, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు సంపత్ రెడ్డిలతో కలిసి సంపూర్ణేష్ బాబు జ్యోతి ప్రజ్వలన, ఆపై అసోసి యేషన్ లోగో ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి, సతీష్, నర్సింగ్ కౌన్సిల్ సభ్యులు సాయిరాం, కౌన్సిలర్లు వితోభ, మోహిజ్, శ్రీహరి పాల్గొన్నారు.